క్లుప్తంగా

తిప్పరాజుపాలెంలో అన్నదానం



రామాలయం వద్ద అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కాజులూరు: తిప్పరాజుపాలెం రామాలయం వద్ద ఆదివారం గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు. గత బుధవారం ఆలయంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో స్వామివారికి వచ్చిన విరాళాలకు తోడు పలువురి దాతల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా సీతారాముల కల్యాణం అనంతరం ఐదో రోజు అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది భక్తులు ఈ అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు రూరల్ గ్రామాల్లో సూర్యప్రకాశ్ ఎన్నికల ప్రచారం

రామచంద్రపురం రూరల్: మండలంలో ఓదూరు, నరసాపురపుపేట, చోడవరం, మాలపాడు, యనమదల, తాడిపల్లి గ్రామాలలో రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్టు పార్టీ కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్న ప్రచార కార్యక్రమాల్లో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా.. శెట్టిబలిజ సంఘం ప్రచారం



ద్రాక్షారామ బియ్యంపేట రామాలయం వద్ద ప్రచారం నిర్వహిస్తున్న శెట్టిబలిజ సంఘ పెద్దలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా శెట్టిబలిజ సంఘ పెద్దలు కట్టా సూర్యనారాయణ, ఇళ్ల సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, కొప్పిశెట్టి ఏడుకొండలు, గుత్తుల నాగబాబు, పంపన విజయదుర్గాప్రసాద్ తదితరులు ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి, కుడుపూరు, పంపనవారిపాలెం తదితర గ్రామాలతో పాటు రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ బియ్యంపేట, ఆదివారపుపేట గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని స్థానికులను కోరారు.

24న కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

మండపేట: కాంగ్రెస్ పార్టీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి కామన ప్రభాకరరావు ఈనెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరు స్థానిక ఏడిద రోడ్డులోని పేరంటాలమ్మ గుడి ఎదురుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయానికి చేరుకోవాలని కామన కోరారు.

హోమియో వైద్యశాల ప్రారంభం



వైద్యశాల సేవలను వివరిస్తున్న నిర్వాహకులు

కె.గంగవరం: పాత కోట గ్రామంలో ఆదివారం ది వరల్డ్ టీచర్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశాలను ప్రారంభించారు. ఇప్పటి నుంచి ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్యశాలను విశాఖపట్నానికి చెందిన సద్గురు పీఠం అధ్యక్షుడు గురు ప్రసాద్, కార్యదర్శి బీఆర్‌కే రాజు ప్రారంభించారు. కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ్య హోమియో వైద్యులు ఈ వైద్యశాల వద్ద పరీక్షలు చేస్తారని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీర రాఘవ, జీఆర్ఎస్ఎస్ శర్మ, వర్షా, యశస్వీ, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

అంతా కృష్ణమయమే..

అయినవిల్లి: ఈ అనంత లోకాలు కృష్ణమయమే, ఆయన మెచ్చెటట్టు మనం జీవించాలని, అప్పుడు మానవ జీవితం శార్థకమవుతోందని నల్లచెరువు గ్రామంలోని అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు, ప్రభుజీ సుందర శ్రీనివాసాదాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువు గ్రామంలో శ్రీకష్ణుని తత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. భగవత్ గీత మన రాతను మారుస్తోందన్నారు. భగవత్ గీతను విన్నా చదివినా జన్మ చరితమవుతోందన్నారు.

నేలమ్మ .. నేలమ్మ .. నేలమ్మా .. .

నీకు వేల వేల వందనాలమ్మా...

- మానవాళి మనుగడకు మార్గదర్శి ధరణి
- పరిరక్షణపై అవగాహన అవసరం
- ప్రమాదంలో పర్యావరణం
- నేడు ధరిత్రీ దినోత్సవం



మండపేటలో వ్యర్థాల తొలగింపు చర్యలను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి (ఫైల్)

కపిలేశ్వరపురం: ఒక్కటే ఉక్కపోత... ఎండలు మండిపోతున్నాయి... వేళ కాని వేళ వర్షాలేమిటి ?... రాత్రంతా వేడి, తెల్లవారేటపుడు మంచు... కలికాల మంటే ఇదేనేమో... అంటూ సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు... విజ్ఞత కలిగినవారు అందుకు గల కారణాలను శాస్త్రీయంగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ప్రకృతిపై ఆధారపడి జీవించే మనిషి ఆ ప్రకృతి పరిరక్షణ పట్ల సామాజిక బాధ్యతతో నడుచుకోనపుడు వ్యక్తమయ్యే ప్రమాదాలే అవన్నీ... నేడు ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

ప్రపంచ ధరిత్రీ దినోత్సవ నేపథ్యమిదీ..

భూమంటే 84 లక్షల జీవరాశుల సముదాయం. సహజ వనరుల వినియోగం మితిమీరి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రకృతిపై మానవులు సాగిస్తున్న విధ్వంసాన్ని ఆపాలన్న లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి ప్రత్యేక సూచనలు చేసింది. ప్రకృతి వ్యవస్థలతో మానవీయంగా మసలుకోవాలన్న ఆ సంస్థ సూచనలపై ధరిత్రీ దినోత్సవం వేళ ప్రపంచవ్యాప్తంగా ఆదివారం సమీక్షలు నిర్వహించనున్నారు. గత ఏడాది ఎర్త్ డే థీమ్ గా «మన గ్రహం కోసం ఖర్చు చేయండి» అనే నినాదాన్ని అమలు చేసింది. ప్లానెట్ వెర్సస్ ప్లాస్టిక్ అనే నినాదంతో నేడు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

భావ ధారిద్ర్యం కాస్తా..

భూమి పరిరక్షణ అనగానే అదేదో మన సమస్య కాదన్న భావనలో సామాన్యులు ఉంటారు. పర్యావరణ సమస్య నేరుగా మనిషిని ప్రభావితం చేస్తుంది. దాంతో ధోరణి ధరిత్రి పట్ల ప్రజల నుంచి ఉదారవాదం వ్యక్తమవుతోంది. రాను రానూ ఈ తీరు పెరిగిపోయి పర్యావరణ సమస్య మరింత తీవ్రమైంది. ఇప్పటికైనా పర్యావరణ సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండక పోతే యావత్ మానవ జాతి మనుగడే ప్రమాదంలో పడే పరిస్థితులున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

వ్యర్థాల ఉత్పత్తితో వ్యయ ప్రయాసలు

ధరిత్రీ సమస్యల కారకాల్లో వ్యర్థాల ఉత్పత్తి ఒకటి. ప్రభుత్వం ప్రజల్లో ఎంతో అవగాహన కల్పిస్తున్నప్పటికీ తక్షణ అవసరాల వల్లనో, ప్రత్యామ్నాయం లేకనో వ్యర్థాలను రహదారులపైనో, చెరువుల చెంతనో వేస్తున్నారు. మండపేట పట్టణం ధర్మగుండం చెరువు వద్ద నివాసితులు తరచూ వ్యర్థాలను వేస్తున్నారన్న వాదన ఉంది. అంకసాని చెరువు చుట్టూ ఉద్యానాన్ని తీర్చిదిద్దారు. అయినప్పటికీ అందులో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు చేరుతుండడంతో పారిశుద్యం లోపిస్తోంది. బురుగుంట చెరువులో 2003లో వ్యర్థాలను తొలగించినప్పటికీ అడపాదడపా వ్యర్థాల సమస్య ఉంటూనే ఉంది.

మండపేట పట్టణంలోని 30 వార్డుల నుంచి ప్రతి రోజూ సుమారు 28 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు విడుదలవుతున్నాయి. రోజూ వీటిని తరలించేందుకు 92 మంది కాంట్రాక్ట్ పారిశుధ్య సిబ్బంది , 30 మంది పర్మినెంట్ సిబ్బంది పని చేస్తున్నారు. రామచంద్రపురం పట్టణంలో 28 వార్డుల పరిధిలో రోజుకు 26 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. మార్కెట్లో రోజూ రెండు టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. 92 మంది పారిశుధ్య కార్మికులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న ఆక్వా సాగు

సహజసిద్ధమైన సాగు పద్ధతులు పోయి వ్యర్థాల ఉత్పత్తి కారకాలుగా మారిపోతున్నాయి. అందులో ప్రధానమైనది ఆక్వా సాగు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలంలో 8వేలు, కె.గంగవరం మండలంలో 3వేలు, రామచంద్రపురం మండలంలో 2 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. మండపేట నియోజకవర్గంలోని కాలేరు, నల్లూరు, అచ్యుతాపురం, వెదురుమూడి, వల్లూరు గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంది.

ధరిత్రీ పరిరక్షణకు చట్టాలిలా..

సహజ వనరుల పరిరక్షణ కోసం ప్రపంచ వ్యాప్తంగానూ, భారతదేశంలోనూ అనేక చట్టాలు రూపొందాయి. వాటిని ఎప్పటికపుడు సమీక్షించుకుంటూ మార్పులు, చేర్పులు చేసుకుంటూ అమలు చేస్తున్నారు. పర్యావరణ న్యాయం అమలు చేసే లక్ష్యంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ చట్టం 2010ని తీసుకొచ్చారు. ఆ ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హరిత న్యాయ స్థానాలు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. తీర ప్రాంత పరిరక్షణకు ఉద్దేశించిన సీఆర్‌జెడ్ నిబంధనలు–2019 ను రూపొందించారు. పాలిథిన్ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం 2013 జూన్ 20న జీవో నంబర్ 46 విడుదల చేసింది. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్ సంచులు, రీసైక్లింగ్ పాలిథిన్ సంచులు, గ్లాసులు, కప్పులను నిషేధించారు.

ఆస్తి కాదు ఆరోగ్యం వారసత్వంగా ఇవ్వాలి



పిల్లలకు ఆస్తిని వారసత్వంగా ఇస్తుంటారు. వాస్తవానికి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ సంపూర్ణమైన ఆరోగ్యాన్ని భావిభారత తరాల వారికి వారసత్వంగా ఇవ్వాలి. భూమి ప్రభావాలపై అవగాహన కల్పించాలి.

– బి.రాజుగోపాల్, సామాజిక కార్యకర్త, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం

ఒట్టేసి చెబుతున్నాం.. ఓటేసి గెలిపిస్తాం..

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌కు బాసటగా మహిళా లోకం
- కాజులూరు మండలంలో ఇంటింటా ప్రచారం
- కాజులూరు గ్రామ పెద్దలను కలసి కుమారుడికి మద్దతు కోరిన ఎంపీ బోస్



కాజులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్ర బోస్

కాజులూరు: వైఎస్సార్ సీపీ పాలనలో తమకు అన్నివిధాలుగా మేలు జరిగిందని ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి మిమ్ములను ఎమ్మెల్యేగానూ, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగానూ గెలిపించుకుంటామని తిప్పరాజుపాలెం శివారు అంచెమ్మచెరువు మహిళలు రామచంద్రపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ చేతిలో చెయ్యివేసి ఒట్టువేసి హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని తిప్పరాజుపాలెం, పెనుమళ్ళ, తనుమళ్ళ, అండ్రంగిలలో అభ్యర్థి సూర్యప్రకాశ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో అధిక సంఖ్యలో స్థానికులు మహిళలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. జగనన్న ఎన్నికల మానిఫేస్టోలో ప్రకటించిన హామీలన్నీ అమలు చేస్తున్నారన్నారు. అటువంటి నిజాయితీ గల నాయకుడిని మనందరం మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అదేవిదంగా కాజులూరులో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్రబోస్ గ్రామ పెద్దలను కలుసుకుని తమ కుమారుడు సూర్యప్రకాశ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, గ్రామ సర్పంచులు దండంగి సరోజిని, తిప్పరాజుపాలెం ఎంపీటీసీ ఆనాల సీత, మాజీ సర్పంచ్ యాళ్ళ శ్రీనివాసు, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, వంగా రంగా, పెంకే విశ్వేశ్వరావు, కట్టా శేఖర్, యాళ్ళ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తిప్పరాజుపాలెంలో మేమంతా నీ వెంటే ఉంటామంటూ సూర్యప్రకాశ్‌కు ఒట్టు వేసి చెబుతున్న మహిళలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

పేదల సంక్షేమం కోసం జగనే మళ్లీ సీఎం కావాలి

కాజులూరు: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. ఆదివారం తిప్పరాజుపాలెంలో స్థానిక మాజీ సర్పంచ్ యాళ్ల శ్రీనివాస్, ఎంపీటీపీ ఆనాల సీత ఆధ్వర్యంలో పలువురు జనసేన, తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలోనికి చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాయపురెడ్డి సత్తిబాబు, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్వో సుధాసాగర్

రామచంద్రపురం: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎలక్షన్ కమిషన్ ఇస్తున్న పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్ సుధాసాగర్ విజ్ఞప్తి చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణపై నియోజకవర్గానికి చెందిన పీవో, ఏపీవోలతో ఆర్వో సుధాసాగర్ అవగాహన సదస్సును స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బందిని జిల్లా పరిధి, అసెంబ్లీ నియోజకవర్గ పరిధి, ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిగా విభజించారన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్, ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్, ఏపీఎస్ఆర్‌టీసీ, మిలటరీ, హెల్త్, రూత్ ఆఫీసర్స్, సెక్టార్ ఆఫీసర్స్ ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌లను ఇస్తామన్నారు. ఎలక్షన్ మిషన్ ఆఫ్ ఇండియా నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటి వద్దే ఓటు వేయడం కార్యక్రమాన్ని నిర్వహించడంపై అధికారులకు ఆర్వో పలు సూచనలు చేశారు. వయస్సు 85 ఏళ్లు పైబడిన వారు, మంచంపై నుంచి లేవ లేని స్థితిలో ఉండేవారికి ఈ అకాశం కల్పించినట్టు తెలిపారు. ఇలా ఓటు వేసేవారు బూత్ లెవెల్ అధికారులకు ఫారం– 12డీ అందించాలని కోరారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫారం –12ను అందించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్వో సుధాసాగర్ తెలిపారు.

నూకాంబిక అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఆలమూరు: శ్రీచింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతోంది. ఆదివారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారుల చేత కాగడాలు వెలిగించి వారకళ్లు, తుళ్లబిళ్లను దిష్టి తీయించారు. గ్రామ పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుద్యాన్ని నెలకొల్పుతున్నారు. వాహనాలన్నింటిని తీర్థంలోకి అనుమతించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయంలో కనీస సౌకర్యాలను కల్పిస్తున్నామని దేవదాయశాఖ ఈఓ ఎంఎస్ఆర్ కష్ణ, జేపీ డి.భాస్కర శ్రీనివాస్ తెలిపారు.

కాపులకు తీరని ద్రోహం చేశారు 'బాబూ'

కాపు నేతల ధ్వజం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కాపు నేతలు

రామచంద్రపురం: రిజర్వేషన్ల కల్పించడంలోను, కాపు కార్పొరేషన్ పెట్టి నిధులు ఇవ్వకుండా టీడీపీ హయంలో చంద్రబాబు తీరని ద్రోహం చేశారని రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన కాపు నేతలు ధ్వజమెత్తారు. రామచంద్రపురం మండలం వెల్లలో ఆదివారం కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు మేర్నిడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాఖా బాబీ, సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, నాయకులు పెమ్మిరెడ్డి మురళి, సాక్షి వేణుగోపాలరావు, వంగా రంగా, తొగరు మూర్తి తదితరులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో కాపు సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ నుంచి 36 మందికి ఎమ్మెల్యే టిక్కెట్లను 5 గురికి ఎంపీ టిక్కెట్లను ఇచ్చారన్నారు. టీడీపీ నుంచి చంద్రబాబునాయుడు 25 మంది ఎమ్మెల్యే టిక్కెట్లను 3 ఎంపీ టిక్కెట్లను మాత్రమే ఇచ్చారని దీనిని బట్టి కాపులపై చంద్రబాబుకు ఎంత చిత్త శుద్ధి ఉందో అర్థమవుతుందని వారు విమర్శించారు. గత 58 నెలల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కాపులకు అన్ని విధాలుగా న్యాయం చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని వారు పేర్కొన్నారు. కాపు నేస్తం పథకంతో కాపు మహిళలకు ఆర్థిక భరోసాను కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. నవరత్న పథకాల ద్వారా పార్టీలకు సంబంధం లేకుండా కేవలం అర్హతతోనే ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, అమ్మఒడి, ఆరోగ్య శ్రీ , ఫీజు రియంబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సురెన్సు వంటి పథకాలు అందుకున్నామని గుర్తు చేశారు. అన్ని రకాలుగా కాపులకు న్యాయం జరిగిందన్నారు. కాపులకు న్యాయం జరిగిందని వారు తెలిపారు.

విమర్శలు సరి కాదు

నియోజకవర్గానికి సంబంధం లేని కొంత మంది ఇక్కడకు వచ్చి కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ప్రకటనలు చేయడం విమర్శించడం సరికాదని హితవు పలికారు. గత 30 ఏళ్లుగా పాలన చేస్తున్న తోట త్రిమూర్తులు, పిల్లి సుభాష్ చంద్రబోస్ ఏ పార్టీలో ఉన్న నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, కానీ ఎక్కడి నుంచో వచ్చిన కాపు నేతలు ఇప్పుడు ఎన్నికల సమయంలో ఇక్కడ విమర్శలుచేయడం మానుకోవాలన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలే ఆదుకున్నాయని, అప్పుడు రాని కాపు నేతులు ఇప్పుడు ఇక్కడ ప్రెస్ మీట్‌లు పెట్టి చిచ్చు పెట్టడం మంచి పద్ధతి కాదని కాపు నేతలు హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన 58 నెలల పాలనలో కాపులు ఎంతో సుభిక్షంగా ఉన్నారన్నారు. నియోజకవర్గానికి చెందిన ఎంపీ బోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎంపీ బోస్ తనయుడు సూర్యప్రకాశ్‌కు నియోజకవర్గంలో కాపులు అధిక సంఖ్యలో ఆయనకు మద్దతును ఇస్తున్నామని అఖండ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌కు బహుమతిగా ఇస్తామని వారు పిలుపునిచ్చారు. రామచంద్రపురం జెడ్పీటీసీ సభ్యుడు మేర్నిటీ వెంకటేశ్వరరావు, సలాది శ్రీను, వల్లా చంటి, అనిశెట్టి చంటి, కొండేపూడి మోహనరావు, వట్టికూటి ఏసుబాబు, తెలగాని ఏడుకొండలు, పాముల సురేష్, అనిశెట్టి శ్రీను, కోటిపల్లి శ్రీను, తోట వీరభద్రరావు, బోణం వీరబాబు, సలాది అంజి, గంటా దుర్గాప్రసాద్, పెట్టా వీరనాయుడు, యాళ్ల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచే నేత తోట

- ఎమ్మెల్యేగా గెలిపించండి
- తోట త్రిమూర్తులుకు మద్దతుగా వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం



గాంధీనగర్‌లోని ఓ వీధిలో జోరుగా ప్రచారం సాగిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: అన్ని వర్గాల ప్రజల ప్రజలకూ అండగా ఉండే నాయకుడు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులును ఎన్నికల్లో గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, ఆ పార్టీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వారందరూ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి పట్టణంలోని 25వ వార్డులో పర్యటించారు. ఆ వార్డు కౌన్సిలర్ ముక్కా మేరీ స్వరూప రాణి, సుబ్రహ్మణ్యం దంపతులు, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో ఈ ప్రచారంలో సాగింది. గాంధీనగర్ 1,2,3 వీధుల ప్రజలను నాయకులు ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తోట త్రిమూర్తులు, రాపాక వరప్రసాద రావులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలు, చేనేత కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారాయణరావు, నాయకులు లంక సత్యనారాయణ, సుంకర కిషోర్, పత్రి రాము, సిరిసిపల్లి జాన్‌కిషోర్, సారిపిల్లి సతీష్, ముక్కా దాలయ్య, గోరు రాంబాబు, సురుకుర్తి నాని, టీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, షేక్ అలీఖాన్ బాబా, నాయకులు పంపన శ్రీనివాస్, పెంకే గంగాధర్, కోనాల చంద్రబోస్, కనికెళ్ల ప్రసాద్, షేక్ ఇమామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



భట్లపాలిక గ్రామంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పిల్లి సూర్య ప్రకాష్, పరిశీలకులు శ్రీనివాసరాజు తదితరులు

కె.గంగవరం: భట్లపాలిక ఎస్సీ, ఎస్టీ ఏరియాలకు చెందిన సుమారు 300 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. పాత భట్లపాలిక గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ పెద్దలు జిల్లెల చిన్ని, జిల్లెల శ్రీను, నాగరావు, రమణ, వడ్లపాటి కృష్ణ, సత్యనారాయణ, చిల్లే క్రాంతి కుమార్, గొల్లపల్లి మాణిక్యం, కుమ్మరి మసరయ్య, జిల్లెల గాంధీ, ఎస్టీ కాలనీకి చెందిన పెద్దలు తాతపూడి జీవన్‌కుమార్, మందపల్లి నానిబాబు, తాతపూడి యోబినేజర్, తాతపూడి సహదేవ్, తాతపూడి జాన్‌తోపాటు వారి వర్గానికి చెందిన సుమారు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతలపాటి శ్రీనువాసరాజు, సర్పంచ్ యలమంచిలి పద్మావతి, ఎంపీటీసీ జిల్లెల్ల బాలసుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు కట్టా తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సదస్యం



ర్యాలి ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో ఆదివారం సదస్యం కార్యక్రమాన్ని వేద పండితులు , అర్చకులు కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. వేకువ జామునే స్వామి వారి గ్రామోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను వేద పండితులు మంత్రాల పఠనంతో నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.